క్లుప్తంగా

భూముల రీ సర్వేపై గ్రామ సభ



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: మండలంలోని మొదటిదశ రీ సర్వే పనులు పూర్తి అయిన పలుకుదొడ్డి రెవెన్యూ గ్రామ పరిధిలోని సంగాలలో బుధవారం తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి గ్రామ సభను నిర్వహించారు. రీ సర్వే వివరాలను గ్రామస్తులకు తెలియజేశారు. వారు మాట్లాడుతూ పలుకుదొడ్డి రెవెన్యూ పరిధి లోని 2,534 మందికి చెందిన 3,877.13 ఎకరాల విస్తీర్ణం ఉన్న భూమిని రీ సర్వే మొదటి దశ పూర్తి అయిందన్నారు. ల్యాండ్ పార్శిల్ నంబర్ (ఎల్‌పీఎస్) ఒకటి నుంచి 2,643 సంఖ్యలను కేటాయించామని వివరించారు. కార్యక్రమంలో మండలసర్వేయర్ నాగభూషణం, వీఆర్వో శ్రీనివాసులు,గ్రామ సచివాలయ సర్వే సహాయకుడు నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గడివేముల:మండల కేంద్రానికి చెందిన శిరివెళ్ల జంబులయ్య (43) మంగళవారం మరణించడంతో అతని భార్య సాలమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఉప సర్పంచ్ తలారి బాలచెన్ని, వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ బుధవారం అందించారు. మిగతా నగదు బాధితురాలి ఖాతాకు ప్రభుత్వం త్వరలోనే జమ చేస్తుందని ఉప సర్పంచ్ తెలిపారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి

సి.బెళగల్: ఓటరు జాబితాలను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ శేషఫణి బీఎల్వోలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఓటరు నమోదు, ఎన్నికల అంశాలపై బీఎల్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా గ్రామాలలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి వచ్చే ఫిర్యాదులను విచారించాలన్నారు. అదేవిధంగా ఓటర్ల మార్పు, చేర్పుల నివేదికలను ఉన్నతాధికారులను సకాలంలో అందజేయాలని మండల గణాంకాధికారి ఆదినారాయణ సూచించారు. సమావేశంలో ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ ఆదామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని జి.సింగవరం బీసీ కాలనీలో రూ.7 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ బుధవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రవిరెడ్డి, ఆదాం, పీఎస్ గోవింద్ పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



దుకాణంలో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను బుధవారం ఏఓ మల్లేష్‌కుమార్ తనిఖీ చేశారు. స్టాక్, విక్రయాల రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. దుకాణాల నిర్వాహకులు అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఏఓ హెచ్చరించారు. కిసాన్ మాల్‌లోని పలు పురుగు మందు నమూనాలను విజయవాడ ల్యాబ్‌లకు పంపుతున్నట్లు ఏఓ తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు బుధవారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.688 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని బొల్లవరం గ్రామంలో 28 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు. బుధవారం గస్తీ తిరుగుతుండగా హోటల్‌లో క్రిష్ణుడు, అతని కుమారుడు మోహన్ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్నారు. వారి నుంచి బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆనందమానందమాయె!

- 23 శాతం పెరిగిన సెర్ప్ ఉద్యోగుల వేతనం
- ఉద్యోగ స్థాయి బట్టి రూ.5 వేల నుంచి రూ.15 వేలు పెరుగుదల



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కోడుమూరు: జిల్లా గ్రామిణభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) పరిధిలో పనిచేసే సెర్ప్(సొసైటీ ఫర్ ఎనిమినేషన్ రూరల్ ప్రాపర్టీ) ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం వేతనం పెంచడంతో ఆ ఉద్యోగుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. 2018లోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేతనాల పెంపు జీఓ ఇస్తారని మభ్యబెట్టి సెర్ప్ ఉద్యోగులను అప్పట్లో మోసం చేశారు. అదే జీఓను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసి సెర్ప్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. సెప్టెంబర్ నుంచి వీరి జీతాలు పెరిగే విధంగా ఆదేశాలిచ్చారు. దీంతో సెర్ప్ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి ఉద్యోగులు క్షీరాభిషేకం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగులకు బేసిక్ వేతనంపై 23 శాతం ప్రభుత్వం పెంచింది. సెర్ప్‌లో కమ్యూనిటీ కో–ఆర్డినేటర్(సీసీ), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్(ఏపీఎం), డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం), అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్స్(ఏఏ) ఉద్యోగులు డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్నారు. సీసీల జీతం రూ.25 వేల నుంచి రూ.40 వేలు ఉండగా వారికి రూ.5,750 నుంచి రూ.9,200 వరకు ఏపీఎంలకు రూ.40 వేల నుంచి రూ.50 వేలుండగా రూ.9,200 నుంచి రూ.11,200 వరకు, డీపీఎంలకు జీతం రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఉండగా రూ.12,500 వరకు జీతం పెరగనుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో డీఆర్‌డీఏ విభాగం కింద 294 మంది ఉద్యోగులు ఉన్నారు. వారందరికీ బేసిక్ వేతనంపై స్థాయిని బట్టి ప్రభుత్వం వేతనాలు పెంచింది.

సెర్ప్ ఉద్యోగుల సేవలను గుర్తించిన ప్రభుత్వం

పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వారికి రుణాలు ఇప్పించడం, రికార్డుల నిర్వహణ పక్కాగా అమలు చేయడంలో సెర్ప్ ఉద్యోగులు కీలకం. డ్వాక్రా సంఘాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి వేతనాలను పెంచింది. పొదుపు సంఘాల అభివృద్ధి వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, జగనన్న పాలవెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళలకు పారదర్శకంగా అందించడంలో సెర్ప్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకు రుణాల మంజూరు, స్వయం ఉపాధి, చిరు వ్యాపారులకు తోడ్పాట్లు అందించడంలో సెర్ప్ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు.

రూ.10 వేలు పెరిగింది



సి.బెళగల్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాకు బేసిక్ వేతనం రూ.45,160 లు వస్తోంది. పెరిగిన 23 శాతం వేతనం కలుపుకుంటే రూ.55,537 వేతనం వస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో మరింత చిత్తశుద్ధితో పనిచేస్తాం.

– వెంకటస్వామి, ఏపీఎం

సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించింది



సెర్ప్ ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. సెర్ప్ ఉద్యోగుల బాగోగుల గురించి ఆలోచించిన ముఖ్యమంత్రి ఈయనే. 23 శాతం వేతనం పెంచడంతో సెర్ప్ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది.

– గుండమయ్య, సీసీ

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఓర్వకల్లు: పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా సూచించారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల, కేతవరం గ్రామాల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించి పార్టీకి మద్దతుగా నిలిచేలా చైతన్యం చేయాలని సూచించారు. సమావేశాల్లో కేతవరం సర్పంచు బోయ గోవర్దన్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మిదేవి, కన్వీనర్లు శివశంకర్, సోమశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ సమీపంలోని కాకతీయ పాఠశాలలో సెప్టెంబర్ 2న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.నరేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో జరిగే పోటీలలో ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఈఓఆర్డీకి పదోన్నతి

పాణ్యం: ఈఓఆర్డీ భాస్కర్‌రావుకు పదోన్నతి లభించింది. ప్రభుత్వం ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజాశ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటంటికి వెళ్లి సంక్షేమ పథకాలను తెలియజేస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. మాయ మాటలు చెప్పే టీడీపీ నాయకులను నమ్మొద్దని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీనే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యంరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఎం. హనుమంతురెడ్డి, బాలచంద్రారెడ్డి, తిరుపాల్, సుబ్రహ్మణ్యం, శివారెడ్డి, సత్యం యాదవ్ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత ఆర్‌జీఎం



ట్రోఫీ అందజేస్తున్న డీన్ అశోక్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న బాస్కట్‌బాల్ పోటీలో ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల విజేతగా నిలిచింది. బుధవారం ట్రోఫీని కళాశాల డీన్ అశోక్‌కుమార్ విజేత జట్టుకు అందించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ మధుసూదనొట్టి పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. బుధవారం పాత బస్టాండ్, వినాయక ఘాట్ ప్రాంతాల్లో లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని రెండు స్వీట్ దుకాణాల్లో తూకం తక్కువ వేస్తుండడంతో కేసులు నమోదు చేసి రూ.20 వేలు జరిమానా వేశారు. వినాయక ఘాట్ వద్ద బండ్లపై విక్రయిస్తున్న పండ్లు వ్యాపారుల తూకాల్లో స్వల్ప తేడాలు రావడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.2 వేలు అపరాధ రుసుం విధించారు. తనిఖీలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రాముడు ఉన్నారు.

నాడు నేడు పనుల పురోగతి పెంచండి



ఇంజినీర్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మనబడి నాడు నేడు రెండవ విడత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ ఆదామ్‌బాషతో కలిసి మన బడి నాడు పనులపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు తరగతి గదుల పనులను నెలాఖరులోగా పూర్తి చేయించాలన్నారు.నాణ్యతగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఎంఈఓ సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ పరిశీలించారు. ఎస్ఓ జ్యోతి, పీఎంసీ సభ్యులతో చర్చించి, నిధుల వినియోగంపై సూచనలు చేశారు. పనులను నాణ్యతగా చేపట్టాలని, అదనపు గదులు సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు కృషి చేయాలని ఆయన సూచించారు.

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ శ్యామల

సి.బెళగల్: జగనన్న కాలనీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల అన్నారు. బుధవారం ఆమె మండల అధికారులతో కలసి కంబదహాల గ్రామం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి నిర్మాణాలలో పురోగతి వచ్చేలా చూ డాలని డీడీ సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీఇంచారు.ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాల అమ లు తీరు, లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామ వలంటీర్ల సేవలు మెరుగుపడాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.అదేవిధంగా కంబదహాల్ జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థుల విదా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, హౌసింగ్ ఏఈ సుమంత్, పంచాయతీ కార్యదర్శి అభిషేకం, హౌసింగ్ సిబ్బంది రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని పారద్రోలడమే లక్ష్యం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదరికాన్ని పారద్రోలడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన దిన్నెదేవరపాడు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వైఎస్సార్ పింఛన్ ఇప్పించాలని, తాగునీటి పైప్ లైన్ వేయించి నీరు సరఫరా చేయించాలని స్థానికులు కోరారు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించి, సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. 98 శాతం సంక్షేమ పథకాలను అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రామ్‌నాథ్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం తెలిపారు. రూ.55 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, కుందూ వాగుపై నిర్మించిన రెండు కాజ్‌వే వంతెనలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

కల్లూరు: సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లకూడదన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల గురించి తెలియజేశారు. బయాలజీ సబ్జెక్ట్ గురించి అవగాహన కల్పించారు. వర్క్ బుక్ కరెక్షన్, పేపర్ కరెక్షన్ అప్‌డేట్ ఉండాలన్నారు. వచ్చే నెల 5లోపు ఫేస్–2 ఆర్‌ఎఫ్ క్రెడిట్ అయిన ప్రధానోపాధ్యాయులు పనులు పూర్తి చేయాలన్నారు.

ఎన్‌ఆర్‌సీలో పిల్లలకు పోషకాహారం

కర్నూలు(హాస్పిటల్): పోషకాహార లోపంతో బాధపడే పిల్లలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పోషకాహారాన్ని అందిస్తోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ, వెంకటరమణ కాలనీ సచివాలయం పరిధిలోని అజ్మద్దీన్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా ఇచ్చి ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్లు ఇవ్వాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేసి ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఆయన అంగన్‌వా డీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి మెనూ, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

పెంపుడు కుక్క అదృశ్యంపై ఫిర్యాదు

కర్నూలు: పెంపుడు కుక్క అదృశ్యమైందని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని హోసన్నా మందిరం దగ్గర నివాసముంటున్న ఆవుల జాన్సన్ మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈనెల 29న సాయంత్రం తాను నీళ్లు పడుతూ ఉండగా తన పెంపుడు కుక్క (లాబ్రడార్ జాతికి చెందిన డబుల్ బోన్ మేల్ డాగ్ ముద్దుపేరు బన్నీ) ఇంటి ఆవరణం నుంచి బయటకు వెళ్లిందని, కాసేపటికే చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన డాగ్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరాడు. ఫిర్యాదును పోలీసులు జనరల్ డైరీ(జీడీ)లో నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9121101061 ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సచివాలయాలతో పల్లెల సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఈర్లదిన్నె గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నాయకులు

సి.బెళగల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయాల ఏర్పాటుతో పల్లెలు సమాగ్రాభివృద్ధి చెందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం సి.బెళగల్ మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచ్ పెద్దక్క, ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోనుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, సచివాలయాలు, ఉద్యోగులు, వలంటీర్ల ఏర్పాటుతో పేదలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు నేరుగా అందుతున్నాయన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

అంతకుముందు ఈర్లదిన్నె గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు స్థానిక నేతలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఈడిగ సరస్వతమ్మ ఇంటి నుంచి క్రిష్టారెడ్డి ఇంటి వరకు రూ.4 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, ఈఓఆర్డీ సందీప్, పీఆర్ ఏఈ గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు నడిపి సోమన్న, గ్రామ నాయకులు క్రిష్టారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిన్న సోమన్న, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి వలిబేగ్, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

గ్రామాలలో అభాగ్యులైన పేదలు తీవ్రమైన జబ్బులు, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతూ, వైద్యం పొందలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని చింతమానుపల్లెకు చెందిన వెంకటరామిరెడ్డి కూతురు మంజులు బోన్‌మెరీ ఫేయిలూర్‌తో తీవ్రమైన అనారోగ్యానికి గురవడంతో వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడ్డారు. మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి మహానంది, నాయకుడు రామచంద్రారెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దృష్టికి ఈనెల 18వ తేదీన తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విజయవాడలోని ఆరోగ్యశ్రీ స్పెషల్ కార్యదర్శి హరికృష్ణను సంప్రదించడంతో మంజుల వైద్యానికి రూ.13లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ప్రభుత్వం మంజూరు అయ్యింది. ఈ మేరకు బాధితులకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు.

పంట నమోదుతో రైతులకు ప్రయోజనాలు



వర్కూరులో పంట నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న, ఏఓ రవిప్రకాష్

కోడుమూరు: ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలను ఈ–క్రాఫ్ యాప్‌లో నమోదు చేయించుకోవడం ద్వారా రైతులకు చాలా ప్రయోజనాలున్నాయని తహసీల్దార్ జయన్న, ఏఓ రవిప్రకాష్‌లు తెలిపారు. మండలంలోని వర్కూరు గ్రామంలో తహసీల్దార్ జయన్న ఏఓ రవిప్రకాష్ పర్యటించి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్‌బీకే, రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్, ఏఓలు మాట్లాడుతూ పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం అందజేసే ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధర తదితర పథకాలు అందుతాయన్నారు. అలాగే రైతు ఏయే పంట సాగు చేసి వుంటే ఆ పంటను మాత్రమే సిబ్బంది ఈ– పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు ఆర్‌బీకే, రెవెన్యూ, సిబ్బందిని సంప్రదించి సెప్టెంబరు 15వతేదీలోగా పంట నమోదు చేయించుకోవాలని వారు సూచించారు.

అభివృద్ధి పనులపై స్పెషలాఫీసర్ సమీక్ష



అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశమైన జేడీ రంగాలక్ష్మిదేవి

కోడుమూరు: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లోని ఇండ్ల నిర్మాణాలు, బడి బయట ఉన్న పిల్లల గుర్తింపుపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మిదేవి బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టుకోని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభించేలా చూడాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, వసంతా లక్ష్మిభాయి, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.